
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జనగామ
ఆదివారం 28 సెప్టెంబరు 2025



మహిళా స్థానాలకు డ్రా తీస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్‌కుమార్

రిజర్వేషన్లు ఖరారు!



- 'స్థానిక' సమరంలో పూర్తయిన కీలక ప్రక్రియ
- జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచుల రిజర్వేషన్ల ప్రకటన
- 12 జడ్పీటీసీ, 12 ఎంపీపీ, 280 సర్పంచ్, 134 ఎంపీటీసీ, 2,534 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్ల పూర్తి
- డ్రా ఆధారంగా మహిళా స్థానాల కేటాయింపు
- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు..
- జిల్లాలో మొదలైన ఎన్నికల సందడి


జనగామ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. ఎన్నికల నిర్వహణలో కీలకంగా మారిన రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ శనివారం ముగిసింది. జిల్లాలోని 12 జడ్పీటీసీ, 12 ఎంపీపీ స్థానాలతోపాటు 280 సర్పంచ్, 134 ఎంపీటీసీ, 2,534 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు కలెక్టర్, సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను ఆర్డీవోలు ప్రకటించగా వార్డు సభ్యుల స్థానాలకు ఎంపీడీవోలు ప్రకటించారు. మొదటగా వార్డులు, సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్లను అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత మహిళల కోటాకు సంబంధించిన స్థానాల కోసం డ్రా పద్ధతిని పాటించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మహిళా స్థానాల కోసం డ్రా తీశారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్‌కుమార్ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల సర్పంచులు, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఆర్డీవోలు గోపీరామ్, డీఎస్ వెంకన్న ప్రకటించారు.

42శాతం రిజర్వేషన్ అమలు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హామీ ఇచ్చినట్లుగానే ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ఈ మేరకు జడ్పీటీసీ, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ స్థానాల్లో 42శాతం రిజర్వేషన్‌ను అధికారులు పాటించారు. అలాగే అటూఇటుగా ఎస్సీలకు 25శాతం, ఎస్టీలకు 16శాతం, అన్ రిజర్వ్ కింద 16శాతం రిజర్వేషన్ కల్పించారు. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీ, 12ఎంపీపీ స్థానాలు, 280 సర్పంచ్, 134 ఎంపీటీసీ, 2534 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఇందులో జడ్పీటీసీ, ఎంపీపీల్లో బీసీలకు 5 స్థానాలు, ఎస్సీలకు 3 స్థానాలు, ఎస్టీలకు 2 స్థానాలు దక్కగా అన్ రిజర్వ్(జనరల్) కేటగిరీలో 2 స్థానాలు ఉన్నాయి.

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
బచ్చన్నపేట	జనరల్	జనరల్ మహిళ
చిల్పూరు	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
దేవరుప్పుల	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
స్టేషన్‌ఘన్‌పూర్	బీసీ జనరల్	బీసీ జనరల్
జనగామ	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
కొడకండ్ల	జనరల్ మహిళ	జనరల్
లింగాలఘనపురం	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
నర్మెట్ట	బీసీ జనరల్	బీసీ జనరల్
పాలకుర్తి	బీసీ మహిళ	బీసీ మహిళ
రఘునాథపల్లి	బీసీ మహిళ	బీసీ జనరల్
తరిగొప్పుల	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
జఫర్‌ఘడ్	బీసీ జనరల్	బీసీ మహిళ



ఫ్చ్..!

- ప్రతికూల రిజర్వేషన్లతో ఆశావహుల్లో నిర్వేదం
- ఎన్నికల్లో పోటీ కోసం ఏళ్లుగా ప్రయత్నాలు
- సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజల చెంతకు..
- రిజర్వేషన్ కలిసి రాకపోవడంతో తీవ్ర నిరాశ
- రిజర్వేషన్లపై జోరుగా చర్చ

జనగామ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రకటించిన రిజర్వేషన్ ఆశావహుల్లో నిరాశను కలిగించింది. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయని భావించిన తరుణంలో ప్రతికూలంగా రావడంతో ఆశావహుల్లో నిర్వేదం నిండుకుంది. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చిన వారు హర్షం వ్యక్తం చేస్తుండగా ప్రతికూలంగా వచ్చిన వారు అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని ఆశిస్తున్న వారికి నిరాశే ఎదురైంది. గతంలో ఎన్నడూ జరగని విధంగా, ఊహించని విధంగా రిజర్వేషన్లు రావడంతో ఆశావహులు, రాజకీయ నాయకులు నివ్వెరపోయారు.

ప్రయత్నాలు వృథాగా..

ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న చాలా మంది గ్రామాల్లో రెండు, మూడేళ్ల నుంచి ప్రయత్నాలు చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో కుల సంఘాల దేవాలయాలకు విరాళాలు ఇవ్వడం, పేదలకు బియ్యం, పేద కుటుంబాలకు పుస్తెమట్టెల వితరణ, మరణించిన కుటుంబాలకు ఆర్థికసాయం వంటి కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. గత కొన్ని పర్యాయాలను రిజర్వేషన్లు గమనించి ఈసారి ఎలాగైనా తమకు అనుకూలంగా రిజర్వేషన్ కలిసి వస్తుందని భావించిన ఆశావహులు ప్రయత్నాలు సాగించారు. కొందరు తమ వ్యాపారాలను సైతం వదిలి రాజకీయాల్లో వచ్చారు. ప్రస్తుతం రిజర్వేషన్ తమకు కలిసి రాకపోవడంతో తీరని నిరాశలో కూరుకుపోయారు. ఎన్నికల్లో పోటీ చేస్తామనే ఆశతో తాము చేసిన ప్రయత్నాలు, సామాజిక కార్యక్రమాలన్నీ వృథాగా పోయినట్టేనని ఆవేదన చెందుతున్నారు.

గ్రామాల్లో జోరుగా చర్చ

స్థానిక సంస్థల రిజర్వేషన్లను ప్రకటించిన నేపథ్యంలో జోరుగా చర్చ నడుస్తోంది. గ్రామాల్లో ఆశావహులు, రాజకీయ నాయకుల్లో ఎవరి నోట విన్నా రిజర్వేషన్ల మాటే వినిపిస్తోంది. తమ గ్రామంలో, మండలంలో వచ్చిన రిజర్వేషన్ ఏంటి? జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీగా ఎవరు పోటీలో ఉంటారన్న దానిపై అంచనాలు వేసుకుంటున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తే ఫలానా క్యాండిడేట్ పక్కా అని భావించగా రిజర్వేషన్ అంచనాలు తారుమారు అయ్యాయి. దీంతో వచ్చిన రిజర్వేషన్‌ను బట్టి ఎవరు పోటీలో ఉండే అవకాశం ఉందన్న దానిపై గ్రామాల్లో రాజకీయ పార్టీలు, ప్రజల్లో విస్తృతంగా చర్చ నడుస్తోంది.

సర్పంచుల రిజర్వేషన్లు..

మండలం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్	మొత్తం
బచ్చన్నపేట	-	5	11	10	26
దేవరుప్పుల	9	5	11	7	32
జనగామ	2	4	8	7	21
లింగాలఘనపురం	1	5	9	6	21
నర్మెట్ట	7	3	5	2	17
రఘునాథపల్లి	5	8	14	9	36
తరిగొప్పుల	5	3	5	2	15
చిల్పూరు	3	3	7	4	17
స్టేషన్‌ఘన్‌పూర్	2	4	6	3	15
కొడకండ్ల	9	3	6	3	21
పాలకుర్తి	11	6	13	8	38
జఫర్‌ఘడ్	4	5	8	4	21
మొత్తం	58	54	103	65	280

ఎంపీటీసీల రిజర్వేషన్లు..

మండలం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్	మొత్తం
బచ్చన్నపేట	-	2	6	5	13
దేవరుప్పుల	3	2	5	2	12
జనగామ	1	2	5	3	11
లింగాలఘనపురం	-	3	5	3	11
నర్మెట్ట	2	1	3	1	7
రఘునాథపల్లి	2	4	6	3	15
తరిగొప్పుల	1	1	3	1	6
చిల్పూరు	2	3	5	2	12
స్టేషన్‌ఘన్‌పూర్	-	2	4	3	9
కొడకండ్ల	3	1	4	1	9
పాలకుర్తి	3	3	7	4	17
జఫర్‌ఘడ్	1	3	5	3	12
మొత్తం	18	27	58	31	134

జడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు-8లో

జయహో దీప్తి జీవాంజీ

అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ కైవసం



మెడల్‌తో దీప్తి

పర్వతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజీ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ - 2025 పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. శనివారం ఢిల్లీలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో 55.16 సెకన్ల సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేసి రాణించింది. ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలలో ఆర్డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రాంమోహన్ రావు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్ కుమార్ పిలుపునిచ్చారు. లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథి పింకేశ్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. పింకేశ్ కుమార్ మాట్లాడుతూ బాపూజీ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనటమే కాకుండా నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడని కీర్తించారు. తెలంగాణ ఉద్యమ తొలి పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవిని సైతం వదిలేసి తెలంగాణ కోసం పోరాటం చేశాడన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ మాచర్ల భిక్షపతి ముదిరాజ్, వేముల బాలరాజు, దోర్నాల వెంకటేశ్వర్లు, ఏలే జనార్దన్, మదాసు ఎల్లయ్య పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, బీసీ సంఘ నాయకులు





కర్షకుడికి కష్టాలే..

- వాతావరణ మార్పులతో పంటలకు తెగుళ్లు
- పొట్ట దశలో దెబ్బతింటున్న వరి పంట
- వెంటాడుతున్న యూరియా కొరత
- జిల్లాలో 2,13,978 ఎకరాల్లో వరి సాగు
- 1,26,119 పత్తి సాగు..

పాలకుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అరుగాలం కష్టపడే అన్నదాతకు కాలం కలిసి రావడం లేదు. ఈ సీజన్‌లో మొదటి నుంచే రైతులు అనేక రకాలుగా కష్టాలు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం ఇబ్బందులు పడుతుండగా, మరో పక్క తెగుళ్ల బెడదతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో అత్యధికంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేశారు. పొట్ట దశలోనే వరికి అగ్గి తెగులు ఆశించి కుంగదీస్తోంది. ఎన్ని రకాల మందులు పిచికారి చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతాంగానికి తీవ్ర నష్టాలు మిగిలేలా ఉంది.

సాగు ఇలా....

జిల్లాలో వర్షాకాలం సీజన్‌లో మొత్తం 2,13,978 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, పత్తి 1,26,119 ఎకరాలు, 5,431 మొక్కజొన్న పంటను సాగు చేశారు. గత ఏడాది 2,11,076 ఎకరాలు సాగు చేశారు. 1,25,994 ఎకరాల పత్తి పంటను సాగచేశారు. 16ఎకరాలు పచ్చజొన్న, 3,451 ఎకరాల్లో కందిపంటను సాగు చేశారు. అంతే కాకుండా 3,664 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ముఖ్యంగా ఈ పంటలకు యూరియా తప్పకుండా వేయాల్సి ఉంటుంది. అయితే యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి ఉంది.

తెగుళ్లతో ఆందోళన..

వరి ఇప్పుడిప్పుడే పొట్ట దశలోకి వస్తోంది. వాతావరణ మార్పులతో తెగుళ్లు, పురుగుల ఉధృతి బాగా పెరిగింది. వరిలో ముఖ్యంగా కాండం తొలుచు పురుగుతో నల్లగా మారి ఆకు మొత్తం ఎండిపోయినట్లు అవుతోంది. అలాగే కంకిలో నల్లి ఉధృతి ఉండడంతో గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి గింజ పాలు పోసుకునే దశలో పంట పూర్తిగా దెబ్బతింటోంది. వరి గెల కిందమెడ భాగంలో నల్లటి కాటుఏర్పడి మెడ వంగిపోయినట్లు అయి కంకి కింద పడిపోతుంది. వరికి కావాల్సిన సమయంలోనే యూరియా చల్లాలి. యూరియా దొరక్క పోవడం, తెగుళ్ల సోకడం, వరి కంకి కూడా తక్కువగా వచ్చే అవకాశ ఉంది. ఈసారి (మిగతా 8లో..)

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



ఉద్యోగులతో బతుకమ్మ ఆడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనగామ కలెక్టరేట్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్‌కుమార్ ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలాబతుకమ్మ వేడుకలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అదనపు పీడీలు చంద్రశేఖర్, నూరుద్దీన్, జౌళి శాఖ జిల్లా అధికారి చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో రజత పతకం



షాట్‌పుట్‌లో రజత పతకం సాధించిన సునీల్‌కుమార్ (మధ్యలో)

బచ్చన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించిన 36వ సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి సునీల్‌కుమార్ షాట్‌పుట్ విభాగంలో రజత పతకం సాధించారు. జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న సునీల్‌కుమార్ పతకం సాధించటంతో అధ్యాపక బృందంతో పాటు గ్రామస్థులు ఇమ్మడి జితేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఏటీసీలతో మెరుగైన ఉపాధి

▸▸ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ మిలీనియం క్వార్టర్స్ సమీపంలో నిర్మించిన ఆధునిక సాంకేతిక విద్యా కేంద్రాన్ని(ఏటీసీ) కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏటీసీల ప్రాముఖ్యత, ప్రాధాన్యతలను వివరించారు. ఆధునిక యుగంలో సాంకేతిక విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కాలానికి అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి, నిరుద్యోగ సమస్యను రూపుమాపాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకొనేందుకు ఈ ఏటీసీలు దోహద పడుతాయన్నారు. భూపాలపల్లి ఏటీసీ ఏర్పాటుకు రూ.43 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రంలో ఆరు ట్రేడులు ఉన్నాయని, వాటిలో విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ఏటీసీల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ఇన్నోవేటివ్ పారిశ్రామికవేత్తలుగా తయారవుతారని అన్నారు. దీని కోసం ఆధునాతన సాంకేతికతతో కూడిన యంత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని భూపాలపల్లి, కాటారంలో ఈ కేంద్రాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఏటీసీ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్, కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ రాజేంద్రప్రసాద్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీర స్వామి, ఉపాధి కల్పన అధికారి శ్యామల, విద్యుత్ ఎస్ఈ మల్సూర్‌నాయక్, మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసులు, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, పిప్పాలరాజేందర్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలో ఏటీసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ

లలితా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు



మహదేవపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజు భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలోని శుభానంద దేవి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

● 5.79 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 5.79 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

కాళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరి నది ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదుల నుంచి వరద వస్తోంది. దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి 10.49 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

యూరియా కోసం రైతుల ఆందోళన

కాటారం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోడౌన్‌లో యూరియా బస్తాలు ఉండగా శనివారం కూపన్లు ఇవ్వడంలో ఆలస్యమైంది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. పీఏసీఎస్ కార్యాలయం ఎదుట కాటారం-మంథని రహదారిపై బైఠాయించారు. రైతులకు బీఆర్ఎస్ నేతలు మద్దతు పలికారు. రైతుల వద్దకు అధికారులు వచ్చి యూరియా బస్తాల పంపిణీకి కూపన్లు ఇస్తారని చెప్పడంతో శాంతించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బాపురావు మండలంలో పర్యటించి పీఏసీఎస్ గోడౌన్, రేగులగూడెం, దామెరకుంట రైతు వేదికల వద్ద ఏవో పూర్ణిమ, పీఏసీఎస్ సీఈవో సతీష్, ఏఈవోలు, పీఏసీఎస్ సిబ్బందితో కూపన్లు రాయించి బస్తాలను పంపిణీ చేయించారు. 1,329 యూరియా బస్తాలను పంపిణీ చేశామని, రెండు రోజుల్లో మరిన్ని అందుబాటులోకి రానున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని రైతులకు డీఏవో బాపురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అస్మా, రాజన్న, దీపక్, పీఏసీఎస్ సిబ్బంది గోపాల్, సాంబమూర్తి, రాజబాపు, అమీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నేతలు

మిర్చి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే

వాజేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోదావరి వరదలకు మిర్చి రైతులు కుదేలైన నేపథ్యంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు విచారం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా వాజేడు మండలంలో శనివారం పర్యటించిన ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి వాజేడు సమీపంలోని నీట మునిగిన మిర్చిపంటను పరిశీలించారు. సుమారు 300 ఎకరాలకు పైగా మిర్చి పంటను గోదావరి వరదలు ముంచెత్తాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కో ఎకరానికి రూ.30వేలకు పైగా నష్టం వచ్చిందని వివరించారు. మిర్చి పంట నష్టంపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేస్తూ సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు విశ్వనాథ ప్రసాదబాబు రాజు, పీఏసీఎస్ చైర్మన్ అంజయ్య, మాజీ జడ్పీటీసీ తల్లడి పుష్పలత, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, నాయకులు కాశీకృష్ణ తదితరులు ఉన్నారు.



నీట మునిగిన మిర్చిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

బడుగులకు అండగా ఉండేది కాంగ్రెస్సే..

● డబ్బులు ముఖ్యమా.. అభివృద్ధి ముఖ్యమా ఓటర్లే గుర్తించాలి

● డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బడుగు వర్గాల అభివృద్ధి కోసం పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో తక్కువ వర్షపాతం నమోదైనా గోదావరి జలాలతో చెరువులు, కుంటలను అలుగులు పోయిస్తున్నామన్నారు. పాఠశాలల నిర్మాణం కోసం సొంత డబ్బులు వెచ్చించి 14 ఎకరాల స్థలాన్ని ఇవ్వటం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో డబ్బులు ముఖ్యమో, అభివృద్ధి ముఖ్యమో ఓటర్లు తేల్చుకోవాలన్నారు. రైతులు ఆర్గానిక్ సాగు వైపు దృష్టి సారించాలని అన్నారు. మండలంలోని 13 మందికి రూ.5.35 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ మసూద్, బండకింది హరిబాబు గౌడ్, జంగిటి విద్యానాథ్, నిడిగొండ శ్రీనివాస్, వంచ వెంకట్‌రెడ్డి, జ్యోతి భాస్కర్, అల్వాల ఎల్లయ్య, నారాయణరెడ్డి, ఆనందం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం వస్తే పాము కాటు



రైతుకు చికిత్స అందిస్తున్న వైద్యుడు

కొడకండ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యూరియా కష్టాలు రైతు ప్రాణాల మీదికి తెచ్చింది. యూరియా కోసం లైన్లో నిలబడ్డ బాలు అనే రైతును పాము కాటేసిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలకేంద్రంలోఉన్న గ్రోమోర్ సెంటర్‌వద్ద వెలిశాల గ్రామ పరిధి ఎంకే తండాకు చెందిన రైతు బాలు శనివారం టోకెన్ తీసుకొని యూరియా కోసం లైన్లో నిలబడ్డాడు. వెనుకనుంచి వచ్చిన పాము కాలుపై కాటేసింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించామని, ఎలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

వరదలో బైక్ సహ కొట్టుకుపోయిన యువకుడు



కాజ్‌వేపై బైక్ సహ వాగులో పడ్డ రాజు

కాటారం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు బైక్‌తో సహ వరదలో కొట్టుకుపోయిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ములుగుపల్లి-అంకుసాపూర్ గ్రామాల మధ్య శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం ములుగుపల్లికి చెందిన కొరళ్ల రాజు అనే యువకుడు బైక్‌పై వస్తూ ములుగుపల్లి-అంకుసాపూర్ గ్రామాల మధ్య చిన్నవాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వేపై అదుపు తప్పాడు. భారీ వర్షాలకు వాగు ఉధృతమై వరద నీరు కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తుండగా దానిపై నుంచి వెళ్లిన రాజు బైక్‌తో సహ కొద్దిదూరం వరకు కొట్టుకుపోయాడు. ఆ తర్వాత వాగును ఈదుకుంటూ సురక్షితంగా బయట పడ్డాడు. వాగులో కొట్టుకుపోయిన బైక్ ఆచూకీ లభించలేదు.

కట్ర్యాలలో కొండచిలువ కలకలం



చెరువులో లభ్యమైన కొండచిలువ

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యో తి): వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో మత్స్యకారుడి వలకు కొండచిలు వ చిక్కడం కలకలం సృష్టించింది. శనివారం స్థానిక ఊర చెరువులో దేశబోయిన కుమార్ చేపల వలను తీస్తుండగాఅందులో కొండచిలువ చిక్కుకుంది. రాత్రి చెరువులో వల వేసి ఉదయం తీయడం మత్స్యకారు లు రోజువారీగా చేస్తుంటారు. ఈ తరుణంలోనే వల ను తీస్తుండగా అప్పటికే వలలో చిక్కుకున్న 10ఫీట్ల కొండ చిలువ ఊపిరి ఆడక చనిపోయింది. దీంతో దానిని మత్స్యకారుడు వెలికి తీశాడు. చనిపోయిన కొండ చిలువను చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చారు.

లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు

ములుగు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల ఎదుట గత మే నెలలో లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులకు రివా ర్డు అందజేశామని ములుగు ఎస్పీ శబరీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లొంగిపోయిన సమయంలో తక్షణ సహాయంగా రూ.25వేలు అందించామని పేర్కొన్నారు. వారి పేరుపై ఉన్న రివార్డు మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఏసీఎం క్యాడర్ మడవి మంగ్లీ(మాసే)కు రూ.3,75,000, పార్టీ సభ్యులు మడకం కమలేష్, మడకం భీమేలకు ఒక్కొక్కరికి రూ.75వేల చెక్కులను అందించామని ఎస్పీ వివరించారు.

19న విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు అక్టోబరు 19న నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు ఆర్.బుచ్చయ్య, జి.నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలు హనుమకొండ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లోని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబరు 4న నామినేషన్లు, 5న నామినేషన్ల పరిశీలన, జాబితా ప్రకటన, 7వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 19న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రక్రియతో పాటు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తారని వారు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విశ్రాంత పోలీసు అధికారులు, అర్హులైన సభ్యులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

విద్యుత్ పనులను వేగవంతం చేయాలి

▸▸ వీసీలో ఆదేశించిన సీఎండీ వరుణ్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలు ఉంటే తెలియజేసే ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ పనులను వేగవంతం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి 16 సర్కిళ్ల విద్యుత్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి శనివారం ఆయా సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, డీఈ టెక్నికల్, డీఈ యంఆర్‌టీ, ఎస్ఏలతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ ద్వారా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని పునరుద్ధరణ పనులను వేగవంతం చేయవచ్చన్నారు. 11 కేవీ ఫీడర్‌లను వేరు చేయడం ద్వారా ఫీడర్‌లోని అంతరాయాలను తగ్గించవచ్చన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డిజిటలైజేషన్ చేయడం ద్వారా ఎంత లోడ్ పడుతుందో సులువుగా తెలుసుకోవచ్చని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు భారం పడకుండా తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆటోమేటిక్ రీడింగ్ తీసుకునే హెచ్‌టీ సర్వీసులకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం పనుల పురోగతిపై చర్చిస్తూ సబ్ స్టేషన్‌లను స్కాడాకు అనుసంధానించడం ద్వారా విద్యుత్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకొని సత్వరమే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. రెవెన్యూ కలెక్షన్‌లను 100 శాతం వసూళ్లు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు సదరల్‌లాల్, అశోక్, వెంకటరమణ, సీజీఎం చరణ్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

● తుడుందెబ్బ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవీందర్



మంగపేటలో మాట్లాడుతున్న ఆదివాసీ నేత రవీందర్

మంగపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర సహాయ కార్యదర్శి పొదెం రవీందర్ డిమాండ్ చేశారు. మంగపేటలో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోని ఆదివాసీల్లో కోయ, నాయకపోడ్, చెంచు, హిల్‌రెడ్డి, గోండు, తోటి, కొలాం, పరదాన్, మన్నెవార్ వంటి తొమ్మిది తెగలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లో చేర్చారని అన్నారు. 1976లో లోకూర్ కమిషన్ ప్రకారం ఎలాంటి ఆదిమ తెగల లక్షణాలు లేని లంబాడీలను డినోటిఫైడ్ ట్రైబల్(డీఎన్‌టీ)గా విద్యా అవకాశాల నిమిత్తం కలిపినప్పటి నుంచి అసలైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీలకు చెందాల్సిన విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ అవకాశాలు దక్కడం లేదని అన్నారు. పాలకులు పునరాలోచించి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాన్నారు. ఆయన వెంట ఆదివాసీ నేతలు పోలెబోయిన ఆదినారాయణ, కాక శేఖర్, పొదెం నాగేష్, పాయం రమేష్ తదితరులు ఉన్నారు.

బలాన్నిచ్చే బతుకమ్మ ఫలహారాలు

- ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
- తొమ్మిది రోజులు తొమ్మిది రకాలు
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

వర్ధన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆడపడుచుల్లో బతుకమ్మ పండుగా ఆరోగ్యకాంతులను వెలిగిస్తోంది. బతుకమ్మ ఆడిన తర్వాత సద్ది పేరుతో 'ఇచ్చినమ్మ వాయినం... పుచ్చుకుంటినమ్మ వాయినం' అంటూ అతివలు ఫలహారాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటారు. వీటిలో అనేక పోషక విలువలు ఉన్నాయంటున్నారు వైద్యులు. ఆటపాటలు, మానసికోల్లాసమే కాదు శరీరానికి కావాల్సిన అనేక పోషకాలను ఫలహారాల రూపంలో బతుకమ్మ అందిస్తోంది.

బతుకమ్మ సద్దిలో ఐరన్

భారతీయ మహిళల్లో ఐరన్ లోపం కనిపిస్తోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రభావం పిల్లల్లోనూ ఉంటోంది. బతుకమ్మ వేడుకల్లో తయారు చేసుకునే సద్దిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల ఫలహారాలను తయారు చేస్తారు. ఇందులో సత్తుపిండి, సద్ద ముద్దలు, నవ్వులు, కొబ్బరి, పల్లిపొడి లేదా ముద్దలు తదితర ఫలహారాలు ఉంటాయి. ఇవన్నీ పండుగ సమయానికి చేతికి వచ్చే చిరుధాన్యాలు. వీటిని తింటే ఆరోగ్యకరమని పెద్దలు చెబుతున్నారు.





నువ్వుల ముద్దలు

బతుకమ్మ పండుగలో నువ్వులు ప్రాధాన్యం అంతాఇంతా కాదు. వీటితో పొడి చేస్తారు. నవ్వుల్లో ఎమినోయాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ముఖ్యమైనవి. జింక్, కాల్షియం ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది.

పెసర ముద్దలు

పెసళ్లను ఉడకబెట్టి బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు. ఇవి జీర్ణశక్తిని పెంచుతాయి. జీర్ణ సంబంధిత వ్యాధులనూ తగ్గిస్తాయి.

కొబ్బరి పొడి, పెరుగన్నం, పులిహోర

కొబ్బరిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మహిళల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. పెరుగన్నం, పులిహోర ఇటీవల సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలు కలుపుతున్నారు. పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు. చింతపండు గుజ్జుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. పెరుగులో పోషక విలువలు మెండు. అన్నం కలిపి కమ్మనైన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇందులో ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లా విటమిన్, విటమిన్ బి-6, బి12, వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కొవ్వు తక్కువగా ఉండే పెరుగులో లాక్టోబసిల్లై అధికంగా ఉంటుంది. అపెండిసైటిస్, డయేరియా, డిసెంట్రీ వంటి వ్యాధులకు కారణమయ్యే బాక్టీరియాను లాక్టిక్ యాసిడ్ నాశనం చేస్తుంది. పెరుగులో ఉండే విటమిన్ నిరోధక శక్తిని పెంచుతుంది.

సద్దుల్లో పోషకాలు

బతుకమ్మ ఉత్సవాలు వస్తే అందరికీ సద్ద ముద్దలు (సజ్జ ముద్దలు) గుర్తుకొస్తాయి. ఈ పేరుతోనే పెద్దబతుకమ్మ సద్దుల బతుకమ్మ అని పేరు వచ్చిందని చెబుతారు. సందె వేళలో చేసే బతుకమ్మ కాబట్టి సద్దుల బతుకమ్మ అంటారని మరో చరిత్ర. సజ్జలను పిండిగా పట్టించి బెల్లం కలిపి ముద్దలు చేస్తారు. కొందరు వీటికి నెయ్యి కూడా కలుపుతారు. వీటిలో పీచు పదార్థాలు ఎక్కువ. కార్బోహైడ్రేట్స్ తక్కువ. ప్రోటీన్లు, కాల్షియం అధికంగా ఉంటాయి. త్వరగా జీర్ణమవుతుంది. దీనికి బెల్లం కలపడంతో ఐరన్ శాతం పెరిగి మహిళల రుతుక్రమ సమస్య నివారణ, గొంతు నొప్పి తగ్గిస్తుందని వైద్యులు వివరిస్తున్నారు.

పల్లి పిండి

పల్లిపిండి శరీర ఎదుగుదలలో అత్యంత ప్రధానమైనది. అధిక ప్రోటీన్లతో పాటు రుచికరంగా ఉంటాయి. చాలామంది ఇష్టంగా తింటారు. దీనికి బెల్లం జోడించడంతో పోషకాలు లభిస్తాయి.

పోషకాలు పుష్కలం


డాక్టర్ బెతం నర్సింహస్వామి, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్



బతుకమ్మ పండుగకు తయారు చేసే సత్తుపిండిలో వ్యాధి నిరోధక శక్తి పెంచే పోషకాలు ఉంటాయి. రుచికరంగా ఉండే సత్తుపిండి పిల్లలకు ప్రోటీన్లు అందిస్తాయి. కండరాల పటిష్టత, ఎముకల గట్టితనం, పిల్లల ఎదుగుదల... ఇలా అనేక ఉపయోగాలున్నాయి. సంప్రదాయ పిండి వంటలను ప్రతిఒక్కరూ తినాలి. బతుకమ్మ ఆరోగ్యాన్ని పంచే ప్రత్యేకమైన పండుగ.

జాతి వైరం విడిచి..

- పిల్లి పిల్లను సాకుతున్న తల్లి కోడి
- మాతృ ప్రేమను పంచుతున్న కోడి



నెక్కొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా జంతువుల మధ్య వైరం ఉండడం సహజం. ఆహారం మొదలు ప్రతీ విషయంలో ఒక జాతి జంతువులు మరో జాతి జంతువులతో పొట్లాటకు దిగుతుంటాయి. కోడి పిల్లలను పిల్లులు వెంటాడి, వేటాడి తింటుంటాయి. కానీ వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బీసీ కాలనీకి చెందిన పొట్లపల్లి వీరస్వామి ఇంట్లో ఉంటున్న పిల్లి తల్లి రెండు నెలల కిందట చనిపోయింది. అప్పటి నుంచి కోడి తన పిల్లలతో పాటు పిల్లి పిల్లను సాకుతోంది. రాత్రి సమయంలో పిల్లి కోడి వద్దనే నిద్రిస్తోంది. జాతి వైరం మరిచి పిల్లి పిల్లను తల్లి కోడి సాకుతూ మాతృ ప్రేమను చాటుకుంటోంది. ఈ విషయంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క ఓటుకు రిజర్వేషన్ కేటాయింపు..!

ఆశాలపల్లి గ్రామంలో ఎస్సీకి రిజర్వు

సంగెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఒక్కరు మాత్రమే ఉన్నారు. పోటీ చేద్దామన్నా ప్రత్యర్థి కూడా ఆ సామాజిక వర్గం నుంచి లేకపోవడం గమనార్హం. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఆశాలపెల్లి గ్రామం సర్పంచ్ రిజర్వేషన్ల కింద ఎస్సీ మహిళకు కేటాయించారు. కానీ, అక్కడ ఎస్సీ ఓటర్లు ఒక కుటుంబం మాత్రమే ఉంది. మన్నెం మల్లమ్మ అనే మహిళకు ఇక్కడి ఓటు హక్కు కలిగి ఉండగా, భర్త వెంకటయ్య ఇటీవల చెరువులో పడి మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా, వారి వివాహాలు సైతం చేశారు. మల్లమ్మ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇక దీనిపై గ్రామస్థులు సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక్క ఓటు మాత్రమే ఉన్న వర్గానికి ఎలా రిజర్వేషన్ కేటాయిస్తారని, దీన్ని రద్దు చేయాలని కోరారు. ఇక ఇదే మండలంలోని వంజరపల్లి గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎవ్వరూ లేకపోయినా, సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. దీంతో గ్రామస్థులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పండుగల వేళ సమ్మెలో టైలర్ వర్కర్లు

- కూలీ రేట్లు పెంచాలని డిమాండ్
- డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతి



డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట గుమికూడిన టైలర్ వర్కర్లు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ముందు హనుమకొండలోని టైలర్ వర్కర్లు శనివారం సమ్మె చేపట్టారు. రెండేళ్లకోసారి వర్కర్ల కూలీ రేట్లను పెంచడం ఆనవాయితీగా వస్తుండగా ఈ యేడు టైలర్ షాపుల యాజమాన్యాలు వర్కర్ల కూలీ రేట్లను పెంచలేదు. కూలీరేట్లను పెంచాల్సిందిగా నాలుగు నెలల నుంచి యాజమాన్యాలను వేడుకుంటున్నా పెంచడం లేదని వర్కర్లు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించారు. డిప్యూటీ కమిషనర్ ఇరు వర్గాలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేసి సయోధ్య చేకూర్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

కాగా, అన్ని పండుగలకంటే బతుకమ్మ, దసరా పండుగలకు అందరు కొత్త దుస్తులు ధరించడం సంప్రదాయంగా వస్తోంది. టైలర్లకు కూడా ఈ పండుగల సమయంలో విపరీతమైన గిరాకీ ఉంటుంది. టైలర్ షాపుల యాజమాన్యాలు షర్టుకు రూ.700, ప్యాంటుకు రూ.900 తీసుకుంటూ తమకు మాత్రం షర్టుకు రూ.174, ప్యాంటుకు రూ.280 మాత్రమే చెల్లిస్తున్నారని వర్కర్లు వాపోతున్నారు. రెండేళ్ల కిందట షర్టుకు రూ.19, ప్యాంటుకు రూ.31 పెంచామని, ఈ యేడు కూడా అదే రేట్లను మళ్లీ పెంచుతామని చెబుతున్నా.. వర్కర్లు వినిపించుకోవడం లేదని యజమానులు తెలిపారు. తమకు కూడా మెటీరియల్‌కు, షాపుల అద్దెలు పెరిగాయని, గిరాకీ కూడా తక్కువైందని అంటున్నారు. రేట్లు ఎక్కువగా పెంచితే తమకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా కూర్చొని మాట్లాడుకుందామని వర్కర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. సమ్మె వల్ల యాజమాన్యాలు, వర్కర్లు ఇరు వర్గాలు నష్టపోతారని, వర్కర్లు గుర్తించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

పర్యాటక ప్రాంతాలకు నెలవు.. వరంగల్

- ఆర్‌డీవో రమేష్ రాథోడ్
- హరిత కాకతీయలో పర్యాటక ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్‌డీవో రమేష్ రాథోడ్



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చరిత్రను, సంస్కృతిని తెలిపే గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్న ప్రదేశం ఉమ్మడి వరంగల్ జిల్లా అని హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి సూచికగా ఎదుగుతుందని అన్నారు. రామప్ప, లక్నవరం చెరువులు, మేడారం, వేయిస్తంభాల ఆలయాలు, ఖిలా వరంగల్ లాంటి పర్యాటక ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ.. టూరిజం పొటెన్షియల్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధిపర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పర్యాటక ఆకర్షణలు పెంచడానికి, దేశ విదేశీ పర్యాటకులను వరంగల్‌కు రప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మిస్‌వరల్డ్‌లో పాల్గొన్న సుందరీమణులను నగరానికి తీసుకు రావడం వల్ల జిల్లా కీర్తి విశ్వవ్యాప్తమైందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పర్యాటక ఉత్సవాల్లో భాగంగా తాడూరి రేణుక శిష్య బృందం నిర్వహించిన నృత్యాలు అలరించాయి. పర్యాటక ప్రాంతాలను తెలిపే గీతంతోపాటు బతుకమ్మ ప్రత్యేక గీతానికి కళా బృందం చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ వాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు హరిత కాకతీయ మేనేజర్ శ్రీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, కుమారస్వామి, ధన్‌రాజ్, కుసుమ సూర్యకిరణ్, లోకేశ్వర్, చిరంజీవి, శరత్, సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదం.. సీతాఫలం..

- ఒత్తిడిని తగ్గించి, నిద్రను మెరుగుపరిచే ఔషధం
- రోగ నిరోధక శక్తిని పెంచే మధురఫలం
- పేదోడి ఆపిల్‌గా దీనికి పేరు..
- నగరంలో ఇప్పటికే ప్రారంభమైన అమ్మకాలు



గ్రామాల నుంచి అమ్మకానికి తీసుకొచ్చిన సీతాఫలాలు

మామునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు అందించే అద్భుతమైన ప్రసాదం పండ్లు. ఆరోగ్యానికి అంతకు మంచిన ఔషధాలు ఉండవు అంటే అతిశయోక్తి కాదు. సీజన్ వారీగా లభించే పండ్లలో సీతాఫలం ఒకటి. వాటికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. బాగా పండిన సీతాఫలం లోపల తియ్యని గుజ్జుతో నల్లని విత్తనాలతో మధురమైన రుచిని కలిగి ఉంటుంది. సహజంగా పండిన సీతాఫలాల రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే.. శీతాకాలంలో మాత్రమే కాసే సీతాఫలం కోసం ఏడాది మెత్తం ఎదురు చూసే వారున్నారు. మామిడి పండ్లకు ఏమాత్రం తీసిపోని క్రేజ్ సీతాఫలాలది. కేవలం రుచికే కాదు.. ఆరోగ్యాన్ని చేకూర్చడంలో కూడా సీతాఫలం ఓ మెట్టు పైనే ఉంటుంది. సీతాఫలం తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మం మెరుస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుంది.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

పేదోడికి అందుబాటులో ఉండి ఉత్తమ పోషక విలువలు కలిగిన ఫలం సీతాఫలం. దీనికి పేదోడి ఆపిల్ అనికుడా పేరొచ్చింది. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఇందులోని పోషకాలు సహాయపడుతాయి. దీనిలో ఉండే బి6 విటమిన్‌తో శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం పొందవచ్చు. ఎసిడిటీని తగ్గిస్తుంది. వీటిలో కెరొటినాయిడ్స్, విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు, వనాయిడ్స్ ఎక్కువ మొత్తంలో ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అంతేకాక చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. జ్వరం ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. అధిక బరువుతో బాధపడేవారు రోజూ ఒక సీతాఫలాన్ని తినడంద్వారా త్వరగా సన్నబడుతారని నిపుణులు చెపుతున్నారు.

ధర తక్కువే..

శీతాకాలంలో మాత్రమే లభించే సీతాఫలాలను గ్రామీణ ప్రాంతాలనుంచి తీసుకువచ్చి పట్టణ శివారు ప్రాంతాల్లో అమ్ముతుంటారు. ఇంకా సీజన్ ఆరంభం కాకముందే ఈ ఏడాది సీతాఫలం అమ్మకాలు చాలా తక్కువ ధరలకే లభిస్తున్నాయి. పట్టణ ప్రజలు, వీటి పోషక విలువలు తెలిసిన వారు ఇప్పటికే కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో సీతాఫలం రేటు రూ.15 నుంచి రూ.20 వరుకు అమ్ముతున్నారు. కిలోల చొప్పున కేజీకి రూ. 70 నుంచి రూ.85 రూపాయల వరకు అమ్ముతున్నారు. మిగతా పండ్లతో పోలిస్తే చాలా తక్కువ ధరకే లభించడం విశేషం.



పోషకాలు పుష్కలం..

సీతాఫలాల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని ఇష్టపడనివారు ఉండరు. ఇందులో ఉండే విటమిన్-సీ, విటమిన్ బి6, ఫైబర్ కాల్షియం, ఆంటీ ఆక్సిడెంట్లు, పీచు పదర్థాలు, ఖనిజ లవణాలు, మెగ్నీషియం, మాంసంకృత్తులు పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్తకణాలను ఉత్పత్తి చేస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలు తొలగించడంలో సహాయపడుతాయి.

29వ తేదీనే సద్దుల బతుకమ్మ

- శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ సంప్రదాయ పర్వం
- పండితుల ఏకాభిప్రాయం



మాట్లాడుతున్న సుదర్శనాచార్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ విషయంలో గందరగోళం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 29వ తేదీనే జరుపుకోవాలని కొందరు, 30న జరుపుకోవాలని మరికొందరు పండితులు ఏకాభిప్రాయానికి రాని నేపథ్యంలో శనివారం అనేక మంది ప్రముఖులు ఈ విషయంపై స్పందించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడిగా చెలామణిలో ఉన్న ఊకల్ నాగేంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు ప్రతిస్పందించారు. శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ విషయంలో సంప్రదాయ పర్వం కాబట్టి మెజార్టీ మహిళల అభిప్రాయమే ప్రధానమన్నారు. కచ్చితంగా సద్దుల బతుకమ్మను 29న సోమవారం జరుపుకోవడం ప్రాంతీయ ఆచారమని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ విషయంలో తిథి వార నక్షత్రం, యోగం, కరుణం లాంటి నియామకాలు ఉండవన్నారు. 6వ రోజు అర్రెంగా భావిస్తు బతుకమ్మను కొంతమంది ఆడరని, అదే క్రమంలో 9వ రోజు నిమజ్జనోత్సవం జరిగి తీరాలన్నది ఆయన స్పష్టం చేశారు. బతుకమ్మ విషయంలో ఎవరెన్ని చెప్పినా 9వ రోజు నిమజ్జనం చేయడం సనాతన సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు.

అలాగే ఎవరెన్ని చెప్పినా సంప్రదాయ నియమం ప్రకారం 29వ తేదీనే మహిళలు సద్దులు జరుపుకొని తీరాలని పండితులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి, వరంగల్‌లోని ఆకారపు గుడి ప్రధాన అర్చకుడు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లంకా శివకుమార్, రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షులు తాండ్ర నాగేంద్రశర్మ, మరో ప్రముఖ వేద పండితుడు గ్రేటర్ హైదరాబాద్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గన్ను సత్యనారాయణశర్మ, హనుమకొండలోని పద్మాక్షి ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకరశర్మ, ఐనవోలు ఆలయ వేద పండితుడు మధుశర్మ, వరంగల్ నగరంలోని ప్రముఖ జ్యోతిష్యకారుడు సుమన్ శర్మ, జనగామలోని శ్రీ వెంకటేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, సిద్ధాంతి సంపత్‌కుమారకృష్ణమాచార్యులు లాంటి అనేక మంది ప్రముఖులు బతుకమ్మ విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేదన్నారు. సోషల్ మీడియా ద్వారా ఎవరికి వారు సద్దుల బతుకమ్మ విషయంలో 29వ తేదీన జరుపుకోవాలని ప్రజలకు తెలియజెప్పారు. ఆదివారం హనుమకొండలోని బ్రాహ్మణ భవన్‌లో పండితులంతా సమావేశమై ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు సమావేశం అవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పరకాల పట్టణంలోని మునిసిపాలిటీ మెజార్టీ మహిళల, పండితుల అభిప్రాయం ప్రకారం 29న సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని కమిషనర్ పేరిట మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడటం గమనార్హం.

ఈనెల 30న సద్దుల బతుకమ్మ

ప్రభుత్వం అధికారికంగా ప్రకటన

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మను ఈనెల 30వ తేదీన జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామక్రిష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగా ప్రభుత్వం ప్రకటించింది తెలిసిందే. ఈ మేరకు ఈనెల 30న సద్దుల బతుకమ్మ పర్వదినమని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఆ రోజు మహిళలు సద్దుల బతుకమ్మ జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆ ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు. కాగా, పండితులు, పంచాంగకర్తలు.. శాస్త్రం, సంప్రదాయం ప్రకారం ఈనెల 29నే సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని సూచించగా, ప్రభుత్వం 30న సద్దులు అని ఉత్తర్వులు విడుదల చేయడం విశేషం.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై బతుకమ్మకు బొట్టు పెట్టి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగినులు పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో వైభవంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారన్నారు. జిల్లాలోని మహిళలందరు ఈ సద్దుల బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ రాజేందర్, టీఎన్‌జీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి సోమయ్యతోపాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘా జేఏసీ నాయకులు, టీఎన్‌జీఓస్ నాయకులు పుల్లూరు వేణుగోపాల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు



బతుకమ్మ వేడుకల్లో టీఎన్జీవో నాయకులు



బతుకమ్మ వేడుకల్లో ఫైర్ గన్ పేల్చుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణం

చిలుపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. శనివారం చేపట్టిన స్వామివారి కల్యాణ మహోత్సవానికి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం వేడుకలకు హాజరైన భక్తుల సమక్షంలో పూజారులు రవిందర్ శర్మ, రంగాచార్యులు వేదమంత్రాలనాలపించి కల్యాణం జరిపించారు. లింగాలఘనపురం మండల మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ,ఉపేందర్‌రెడ్డి దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు జున్నూతుల సుధీర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్య, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్, గనగోని రమేష్, వెంకటేశ్వర్లు, పి. నారాయణరెడ్డి పాల్గొన్నారు.



శివునిపల్లి లో బరోడా బ్యాంకు వద్ద మండపంలో పూజలు

వేడుకగా కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు





జనగామ తహసీల్దార్ కార్యాలయంలో, బచ్చన్నపేట ఎంపీడీవో ఆఫీస్‌లో బతుకమ్మ వేడుకలు

జనగామ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పర్వదినాలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సంబరాలు కొనసాగుతున్నాయి. జనగామ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌రెడ్డి, ఎంఆర్ఐ అన్వేశ్, ఏఆర్ఐ వెంకటేశ్వర్లు, మహిళా ఉద్యోగులు కవిత, మమత, చంద్రకళ, ఉమా మహేశ్వరి, స్వాతిలు బతుకమ్మ పాటలతో బతుకమ్మ ఆడి వేడుకలను జరుపుకున్నారు.

● బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో మమతాభాయి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యాలయ మహిళా సిబ్బంది, డ్వాక్రా మహిళలు శనివారం బతుకమ్మలు పేర్చి ఆటలు ఆడి పాటలు పాడారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన వారికి బహుమతులను తహసీల్దార్ రామానుజాచారి, ఎంపీడీవో మమత, ఎంపీవో మల్లిఖార్జున్‌లు అందజేశారు.

● జనగామ కల్చరల్(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పర్వదినాలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సంబరాలు కొనసాగుతున్నాయి. జూనియర్ కళాశాలలకు 28నుంచి సెలవులు ప్రకటించడంతో శనివారం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఎస్ఎస్‌వీ వొకేషనల్ జూనియర్ కళాశాలలో డైరెక్టర్లు కూటిగంటి రమేష్, నవీన్‌కుమార్, పరశురాములు, రవి ఆధ్వర్యంలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో హాజరై బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

లలిత త్రిపుర సుందరీగా అమ్మవారు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఏడో రోజు ఘనంగా నిర్వహించారు. ఘన్‌పూర్‌లో ఎల్లమ్మ దేవాలయంలో, హనుమాన్ జ్యోతిషాలయం, శివునిపల్లి గాంధీ విగ్రహం, లలితాంబికా దేవాలయంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవి రూపంలో అలంకరించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. శివునిపల్లి బరోడా బ్యాంకు వద్ద ఉత్సవాలు సాగుతున్నాయి. సహస్ర శివ లింగాల పూజ అనంతరం శివలింగాలను చెరువులో నిమజ్జనం చేశారు.



శివునిపల్లి లో బరోడా బ్యాంకు వద్ద మండపంలో పూజలు

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

రఘునాథపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్రిటిష వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడి వారి చేతిలో ఉరి తియబడ్డ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ అన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా మండలంలోని ఆశ్వరావుపల్లిలో శనివారం ఆయన చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంబరాజు, వంశీ, వెంకటేష్, సాయి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు సూడిగేదె మృతి

బచ్చన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బచ్చన్నపేటకు చెందిన చిట్టి రాంరెడ్డికి చెందిన సూడిగేదె శుక్రవారం రాత్రి పిడుగు పాటుకు గురై మృతి చెందింది. దీని విలువ రూ. 1.20 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు



నర్మెటలో ఆర్ఎస్ఎస్ శత జయంతి పాల్గొన్న సభ్యులు

నర్మెట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయ దశమి ఉత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కార్యవాహ బత్తుల నరేందర్, నర్మెట ఖండ కార్యవాహ వంగ రవి, ఆర్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా మేకల బాలసిద్దయ్య మాట్లాడారు. గడిచిన వందేళ్లలో దేశానికి అనేక రంగాల్లో సేవలు అందిస్తూ జాతీయ భావన, దేశభక్తిని పెంపొందించిందని తెలిపారు. డాక్టర్ హెడ్గేవార్ ప్రారంభించిన ఈ సంఘ శాఖలు నేటి వరకు దేశమంతటా వ్యాపించాయని, గ్రామంలో స్వయం సేవకులు జాతీయ భావనతో సేవ చేస్తున్నారన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ క్రీడలు



మొదటి బహుమతి పొందిన హైదరాబాద్ జట్టు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జనగామలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 69వ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం ముగిశాయి. క్రీడల కన్వీనర్ అజ్మీర కిషన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీలను నిర్వహించామని మొదటి స్థానంలో హైదరాబాద్, ద్వితీయ బహుమతి మహబూబ్‌నగర్, తృతీయ బహుమతి వరంగల్ జిల్లా సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు మొదటి వారంలో జమ్ము కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సాదాబైనామాలపై అభ్యంతరాల స్వీకరణ

కొడకండ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మక్కపల్లి, ఏడునూతుల రెవెన్యూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభలో సాదాబైనామాల అభ్యంతరాలపై డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, సీనియర్ అసిస్టెంట్ సుమన్ శనివారం ఫిర్యాదులు స్వీకరించారు. పద్మజ, సుమన్‌లు మాట్లాడుతూ లక్ష్మక్కపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న వివిధ గ్రామాలకు చెందిన 609 మంది, ఏడునూతులలో 125మంది సాదాబైనామా దరఖాస్తుదారులైన రైతులకు నోటీసులు అందించామన్నారు. లక్ష్మక్కపల్లిలో మొత్తం 12రాగా, ఏడునూతులలో 4 అభ్యంతరాలు వచ్చాయన్నారు.



లక్ష్మక్కపల్లిలో అభ్యంతరాన్ని స్వీకరిస్తున్న పద్మజ

గుంతల పూడ్చివేత



పల్లగుట్ట మార్గంలో గుంతలను పూడుస్తున్న నాయకులు

చిలుపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నుంచి మండలంలోని పల్లగుట్ట వైపు వెళ్లే మార్గంలో ఏర్పడ్డ పెద్ద గుంతలను కాంక్రీట్ డస్ట్‌తో పూడ్చివేశారు. శనివారం కాంగ్రెస్ నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు నేతృత్వంలో ట్రాక్టర్లతో డస్ట్‌ను తెప్పించి పూడ్చివేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజుగౌడ్, చిలుపూర్ గుట్ట డైరెక్టర్ ఎలగందుల రత్నాకర్‌రెడ్డి, జీడి ఆనందం, దార అశోక్‌పాల్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రాజారాం



నర్మెట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నర్మెట గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా పండుగ రాజారాం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని రాజారాం పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పులి మధుసూదన్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



పాలకుర్తిలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాధ్యులు



బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో జయంతి వేడుకలు

పాలకుర్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ముందుండి పోరాడిన, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని రాజీవ్ చౌరస్తాలో శనివారం పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు మేడారపు సుధాకర్ మాట్లాడుతూ ఆయన జీవితమే రాష్ట్రం ఏర్పాటు కోసం అంకితమైందన్నారు. 1969లో జరిగిన ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పెనుగొండ చిదిరాల ఎల్లయ్య, చిదిరాల మార్కెండయ్య, పెనుగొండ వెంకటేశ్వర్లు, రమేష్, సోమేశ్వర్, నాగయ్య, పుండరీకుడు, కాటబత్తిని సోమేశ్వర్, చిలుకమారి శ్రీధర్, ఎనగందుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రం కోసం సాగిన తొలి ఉద్యమంలో లక్ష్మణ్ బాపూజీ పాత్ర మరువలేదన్నారు. పలుచోట్ల బాపూజీ చిత్ర పటాలకు నివాళులర్పించారు.



నవీన్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న కొమ్మూరి

సోషల్ మీడియా కో- ఆర్డినేటర్‌గా నవీన్‌కుమార్

తరిగొప్పుల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తరిగొప్పుల మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా మండల కేంద్రానికి చెందిన ఎడ్ల నవీన్‌కుమార్ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నవీన్‌కు కుమార్ శనివారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పండుగ కనకయ్య, బైకని బాలరాజు యాదవ్, దామెర లూక, పింగిళి ఇంద్రారెడ్డి, ఎర్రవెల్లి పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ
కూలి దుర్మరణం

● ముగ్గురికి గాయాలు ● మృతుడిది మధ్యప్రదేశ్ రాష్ట్రం



సుకుమాన్ మృతదేహం

పాలకుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొట్టిన ఘటనలోమధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బాలాగడ్ జిల్లా సతారియాకు చెందిన సుకుమాన్(24) శనివారం రాత్రి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం. అవివాహితుడైన సుకుమాన్ కూలీ పనుల కోసం రెండు నెలల క్రితం పాలకుర్తికి వచ్చిన స్నేహితులతో కలిసి అద్దె రూంలో ఉంటున్నాడు. కాగా, బమ్మెర నుంచి పాలకుర్తి వైపు వస్తున్న మోటార్ సైకిల్, గుడివాడ చౌరస్తా నుంచి నిత్యావసర సరుకులు తీసుకొని బొమ్మిశెట్టి కాలనీ వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆర్చిగేట్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మధ్యప్రదేశ్‌కు చెందిన సుకుమాన్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి గాయాలు కాగా, ఇద్దరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా, బమ్మెరకు చెందిన గుర్రం శోభన్‌కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

కర్షకుడికి కష్టాలే..

(5వ పేజీ తరువాయి)

పది శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశముందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు.

యూరియా కొరతతో ఇబ్బందులు

వరి నాట్లు వేసినప్పటి నుంచి యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో యూరియా అందకపోతే వరి ముదిరిపోతోందని, దీంతో దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు. ఎకరానికి సుమారు రెండు బస్తాల యూరియా అవసరంగా ఉపయోగించాలి. ఇప్పటి వరకు రైతులకు అందిన పరిస్థితి లేదు. దీంతో వరిలో ఎదుగుదల లేకపోవడంతో రైతులను మరింత కుంగదీస్తోంది. రైతులు యూరియా కొనుగోలు కేంద్రాల వద్ద క్యూలైన్లు కట్టిన ఒక్క బస్తా యూరియా దొరకని పరిస్థితి ఉంది. ఇప్పటికీ జిల్లాలో నిత్యం రైతుల పీఏసీఎస్, గ్రోమోర్, ఆగ్రోస్ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరుతున్న పరిస్థితి ఉంది. ఒక పక్క వరి పంట పత్తి, మొక్కజొన్న పంటలు రోగాల బారిన పడడం, మరోపక్క ఎరువుల కొరత ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

కట్ట అంబికాసోనీ, జిల్లా వ్యవసాయాధికారి



నాట్లు వేసినప్పటి నుంచే వరి పొలాన్ని రైతులు గమనిస్తూ ఉండాలి. ప్రస్తుతం వస్తున్న వాతావరణ మార్పులతో అగ్గితెగులు, పొడ తెగులు కాండం తొలుచు పురుగు సోకుతోంది. వీటి నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ ఎకరానికి 4 కిలో గ్రాములనీటితో కలిపి పిచికారి చేయాలి. ట్రైసైక్లోజోల్ 6 గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. వ్యవసాయాధికారుల సలహా మేరకే మందులు వాడాలి.

పేదల సంక్షేమమే ధ్యేయం: సీతక్క

ములుగు రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యో తి): పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ములుగు, మల్లంపల్లి మండలాల పరిధిలోని లబ్ధిదారులకు రేషన్‌కార్డులను మంత్రి శనివారం పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ములుగు ని యోజకవర్గంలో ఇప్పటికే 10వేల మందికి కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. పేదలకు ఇవి కీలకమని, దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలి పారు. కొత్త కార్డులను పంపిణీ చేయడమే కా కుండా లబ్ధిదారులకు ఎన్నడూ లేనివిధంగా సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. అలాగే పేదలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు అదనపు కలెక్టర్ మహేందర్ జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణితో కలిసి యూనిఫామ్‌ను మంత్రి పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసే అవకాశం ఉందనే ప్రచారంలో నిజం లేదన్నారు. రాష్ట్రంలో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. కారుణ్య నియామకాలు చేపట్టడానికి సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే కసరత్తులు ప్రారంభించారని అన్నారు. ప్రభుత్వ సహకారంతో మహిళా సంఘాల సభ్యులు విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ, ఆర్థికంగా ఎదుగుతున్నారని మంత్రి అన్నారు. సోలార్ ప్లాంట్లు, ఆటోలు, వాహనాలు, బస్సుల కొనుగోలు కోసం వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు, గెజిటెడ్ సంఘం ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. డీడబ్ల్యూవో తుల రవి, డీసీఎస్‌వో షా ఫైజల్ హుస్సేనీ, ప్రజా ప్రతినిధులు, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన భవన్‌లో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి

జడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు జడ్పీలు

2 ఎస్టీలకు, 2 ఎస్సీలకు 1 బీసీకి, 1 జనరల్‌కు రిజర్వు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం శనివారం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లా పరిషత్‌లలో రెండు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి బీసీకి రిజర్వు కాగా, ఒకటి జనరల్ అయింది. మూడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు కేటాయించారు. మూడు జనరల్‌గా ప్రకటించారు.స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చినప్పటికీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులను రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని రిజర్వు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ వర్గానికి ఒక్క స్థానమే దక్కింది. హనుమకొండ జిల్లా పరిషత్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, వరంగల్ జిల్లా జిలా పరిషత్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది.

జనగామ ఎస్సీ మహిళ, జయశం కర్ భూపాలపల్లి జిల్లా బీసీ జనరల్, ములుగు ఎస్టీ మహిళకు, మహబూబాబాద్ జనరల్ రిజర్వు అయింది.

రిజర్వేషన్ రాజ్యాంగపరంగా విరుద్ధం

జనగామ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్ రాజ్యాంగపరంగా విరుద్ధమని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రామకోటి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా 2011 కులగణన ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించారని, కేవలం బీసీల ఓటు కోసమే 2024 కుల గణన ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను సమాధి చేసే కుట్ర అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించిన తర్వాత కూడా ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్న గ్రామాలకు జనరల్ రిజర్వేషన్ తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ఉత్కంఠ



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సమక్షంలో స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని ఘన్‌పూర్ స్టేషన్, చిలుపూరు, జఫర్‌గడ్, పాలకుర్తి, కొడకండ్ల మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, ఆశావహులు రిజర్వేషన్లు ఎలా వస్తాయోనని శనివారం అక్కడికి చేరుకొని ఉత్కంటగా ఎదురుచూశారు. రిజర్వేషన్లు కొందరు నాయకులకు అనుకున్న విధంగా రాకపోవడంతో అక్కడి నుంచి నిరాశగా వెనుదిరిగిపోగా, అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చిన నాయకులు సంతోషంతో గెలుపు అంచనాలు సహచరులతో చర్చించుకున్నారు.

ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక



కమిటీని సన్మానిస్తున్న టీఎన్‌జీవో యూనియన్ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వసతి గృహ అధికారుల ఫోరం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్‌జీవో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా ఎన్నికల అధికారిగా యూనియన్ ఉపాధ్యక్షుడు కె.సంపత్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా చింత రాంనర్సయ్య. కార్యదర్శిగా మల్లు, కోశాధికారిగా మెయిన్, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.దేవేందర్, ఉపాధ్యక్షులుగా సీహెచ్. యాకయ్య, ఆర్. అనిల్, బి.తిరుమల, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో నాయకులు పెండెల శ్రీనివాస్, ప్రభాకర్, హఫీజ్, నాగార్జున తదితరరులు పాల్గొన్నారు.

2న మాంసం దుకాణాలు బంద్

జనగామ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున మాంసం దుకాణాలను బంద్ చేయాలని, ఎవరైనా జీవహింస చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జనగామ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గాంధీ జయంతి అదే రోజున దసరా పండుగ వస్తున్న సందర్భంగా మాంసం విక్రయదారులు ఎవరుకూడా జీవహింస చేయరాదన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మానుకోట మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు 28నుంచి అక్టోబరు5 వరకు పండుగ సెలవులు ప్రకటించినట్లు చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సద్దుల బతుకమ్మ, మంగళవారం దుర్గాష్టమి, బుధవారం మహర్నవమి, అక్టోబరు 2న గాంధీజయంతితో పాటు విజయదశమి, 3న ప్రభుత్వ సెలవుతో పాటు శని, ఆది వారాలు వారాంతపు సెలవులు ఉన్నట్లు చెప్పారు. తిరిగి అక్టోబర్ 6న మార్కెట్‌లో క్రయవిక్రయాలు ప్రారంభమవుతాయని చెప్పారు.